ఇల్లు వచ్చె.. జనం మెచ్చె..

- సంతవేలూరులో ఊపందుకున్న జగనన్న హౌసింగ్ ఇళ్ల నిర్మాణం
- 206 గృహాలకు బిల్లుల రూపేణా రూ.2.85కోట్లు చెల్లింపు



సంతవేలూరులో ఏర్పాటైన జగనన్న కాలనీలో నూతనంగా నిర్మించిన ఇళ్లు

ప్రతి ఒక్కరూ సొంతిల్లు ఉండాలని ఆశిస్తూ ఉంటారు. అయితే చాలా మంది పేద, మధ్య తరగతి ప్రజలు సొంతిళ్లు లేక అద్దె ఇళ్లలోనే నివాసం ఉంటున్నారు. ఆర్థిక పరిస్థితి మూలాన చాలా మంది సొంతింటి కలను నెర వేర్చుకోలేకపోతున్నారు. గత ప్రభుత్వ పాలనలో ఇంటి స్థలం, పక్కా గృహం కోసం కాళ్లరిగేలా ప్రదక్షిణలు చేసినా మంజూరు చేసే వారు కాదు. నాయకుల సిఫార్సులకే అవి అందేవి. అయితే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తీసుకుంటున్న చర్యల మూలాన కొత్తగా ఊర్లకు ఊర్లే పుట్టుకొస్తున్నాయి. పేదల సొంతింటి కల సాకారం అవుతోంది.

వరదయ్యపాళెం: మండలంలోని సంతవేలూరు వద్ద ఏర్పాటు చేసిన జగనన్న లేఅవుట్‌లో 206 ఇళ్లు మంజూరయ్యాయి. ఒక్కో లబ్ధిదారుకు రూ.1.80లక్షలు ఆర్థిక సాయం చేయడమే కాకుండా తక్కువ ధరకు నిర్మాణ సామగ్రి అందిస్తున్నారు. ఇప్పటివరకు 35 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి.



జగనన్న కాలనీలో నూతనంగా నిర్మించిన ఇళ్లు

71 ఇళ్ల నిర్మాణం వివిధ దశల్లో ఉంటోంది. వీటికి సంబంధించి రూ. 2.85కోట్లు బిల్లుల రూపంలో చెల్లించినట్లు హౌసింగ్ అధికారులు తెలిపారు. అలాగే నీటి వసతి కోసం బోరు, పైపులైను, ట్యాంకు, కుళాయిలను కూడా యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేశారు. నూతనంగా ఏర్పాటైన జగనన్న కాలనీకి విద్యుత్ స్తంభాలు, లైన్లు, నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను అమర్చి విద్యుత్ సౌకర్యం కల్పించారు. అలాగే కాలనీల్లో రోడ్లు, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక వసతులు ఏర్పాటు కావడం, బిల్లులు చకచక మంజూరు అవుతుండడం, రాయితీపై నిర్మాణ సామగ్రిని ఇస్తుండడంతో బ్ధిదారులు కూడా వేగవంతంగా నిర్మాణాలు చేస్తున్నారు. ఈ దిశగా సౌకర్యాలతో సంతవేలూరులో స్థానికులకు సొంతింటి కల సాకారమవుతుండడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.



జగనన్న కాలనీలో ఏర్పాటు చేసిన మంచినీటి ట్యాంకు, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్

ప్రభుత్వ ప్రోత్సాహం మరువలేనిది



జగనన్న ప్రభుత్వం మాకు సంతవేలూరు జగనన్న లేఅవుట్‌లో స్థలం ఇచ్చింది. ఇల్లు మంజూరు చేసింది. రూ. 1.80లక్షలు బిల్లు కూడా మంజూరు చేసింది. ఇల్లు కట్టుకునేందుకు అధికారులు సాయం చేశారు. ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం.

–బి. పోలమ్మ, సంతవేలూరు గిరిజనకాలనీ

గత ప్రభుత్వం చేయలేని పని జగనన్న ప్రభుత్వం చేసింది



పూరింట్లో ఉన్న మేము పోయిన టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇల్లు మంజూరు కోసం ఎన్నోసార్లు తిరిగినాం. కాయితాలు ఇచ్చినాం. కానీ ఏమాత్రం పట్టించుకోలా. ఇప్పుడు జగనన్న ప్రభుత్వంలో మా ఊరి కాడే కొత్తగా జగనన్నకాలనీ కట్టిస్తాండాది. దాంట్లో నాకు ఇంటి స్థలమిచ్చినారు. ఇంటి పని పూర్తి కావస్తాంది. త్వరలో గృహ ప్రవేశం చేస్తా.

–ఎ. సుమతి, సంతవేలూరు గిరిజనకాలనీ

సీఎం జగనన్నకు రుణపడి ఉంటాం



మాది పేద గిరిజన కుటుంబం. ఇల్లు లేక వర్షాకాల మొస్తే బాగా అవస్థలు పడేవాళ్లం. జగనన్న ప్రభుత్వంలో మాకు ఇల్లు మంజూరు చేసినారు. ఇల్లు కట్టే పని జరగతాంది. ఇంకో నెలరోజుల్లో పూర్తయిపోతాది. ఊపిరి ఉన్నంత జగనన్నకు రుణపడి ఉంటాం.

–టి. సుదర్శన, సంతవేలూరు గిరిజనకాలనీ

క్లుప్తంగా

ఎంఆర్‌సీకి చేరిన పాఠ్య పుస్తకాలు



పాఠ్య పుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఈఓ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 3,457 మంది విద్యార్థుల కోసం పాఠ్య పుస్తకాలు స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయానికి చేరాయని ఎంఈఓ రవీంద్రనాథ్ తెలిపారు. జగనన్న విద్యాకానుకలో భాగంగా విద్యార్థులకు వీటిని పాఠశాలలు తెరచిన వెంటనే అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుస్తులు పంపిణీ

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేటలో శనివారం కేశవ ఫ్యాషన్స్ అధినేత కేశవులు చేతుల మీదుగా గిరిజన విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు. యువనేస్తం అసోసియేషన్ వ్యవస్థాపకుడు మునిశేఖర్ విజ్ఞప్తిపై స్పందించి 79 మంది విద్యార్థులకు ఈ వితరణ చేశారు.

శ్మశానవాటిక పునరుద్ధరణ పనులు



శ్మశానంలో మట్టిని తోలుతున్న ట్రాక్టర్

ఏర్పేడు: మండలంలోని ఎండీపుత్తూరు పంచాయతీ మిట్ట ఇండ్లు గ్రామ శ్మశాన వాటిక పునరుద్ధరణ పనులు శనివారం ముమ్మరంగా జరిగాయి. శ్మశానంలో దట్టమైన ముళ్ల పొదలను జేసీబీతో తొలగించి చదును చేశారు. ట్రాక్టర్లతో మట్టి, ఎర్రగుల్లను తోలి చదును చేశారు. గ్రామస్తులు సర్పంచ్ మోహనప్రియకు కృతజ్ఞతలు తెలిపారు.

మండలాభివృద్ధికి నిధులు మంజూరు చేయరూ!



జెడ్పీ సీఈఓతో మాట్లాడుతున్న సుమన్‌కుమార్

నారాయణవనం: మండలంలో అభివృద్ధి పనులకు జెడ్పీ నిధులను కేటాయించాలని జెడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డిని కోరినట్లు జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు, జెడ్పీటీసీ సభ్యుడు కోనేటి సుమన్‌కుమార్ తెలిపారు. శనివారం చిత్తూరులో సీఈఓను ఆయన కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. మీడియాతో సుమన్ మాట్లాడుతూ, మండలంలో పూర్తి చేసిన సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు, సచివాలయ భవనాల పెండింగ్ బిల్లులను సకాలంలో చెల్లించడానికి చర్యలు తీసుకోవాలని, తాగునీటి ఎద్దడిని అధిగమించడానికి బోర్లను మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. సీఈఓ సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు.

మహిళ అదృశ్యంపై ఫిర్యాదు

ఏర్పేడు: మండలంలోని పాతవీరాపురంలో మహిళ అదృశ్యంపై శనివారం ఫిర్యాదు అందిందని ఏర్పేడు సీఐ శ్రీహరి తెలిపారు. గ్రామానికి చెందిన మమత(45) కుమారుడు (1)తో కలిసి శుక్రవారం ఏర్పేడుకు వెళ్లారు. సాయంత్రం వరకు తిరిగి ఇంటికి చేరుకోకపోవడంతో ఆమె తల్లి మల్లీశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

వ్యక్తిపై కేసు నమోదు

ఏర్పేడు: మండలంలోని నాగంపల్లెలో భూతగాదా ఘటనలో వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఏర్పేడు సీఐ శ్రీహరి శనివారం రాత్రి తెలిపారు. శుక్రవారం ఇరు వర్గాల మధ్య భూతగాదా చోటుచేసుకోవడంతో పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు. దీంతో సీఐ ఇరు వర్గాలపై కేసు నమోదు చేశారు.

పల్లంపేటలో..

మండలంలోని పల్లంపేటలో ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఏర్పేడు సీఐ శ్రీహరి శనివారం రాత్రి తెలిపారు. పల్లంపేటకు చెందిన పెంచలనాయుడును గ్రామానికి చెందిన ప్రకాష్ అసభ్య పదజాలంతో దూషించి, దాడి చేయడంపై కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

ప్రమాదవశాత్తు వృద్ధురాలి మృతి

తిరుపతి తుడా: తిరుపతి కొర్లగుంట మెయిన్ రోడ్డు దాటుతూ శనివారం వృద్ధురాలు మృతి చెందింది. కొర్లగుంట మాస్టర్ ప్లాన్ రోడ్డు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అక్కడ ఎవరూ రాకుండా బారికేడ్లు, నో ఎంట్రీ బోర్డు ఏర్పాటు చేశారు. వరలక్ష్మి (72) బారికేడ్లను దాటుకుని వచ్చే క్రమంలో కాలుజారి కాంక్రీట్ మిక్సర్ మెషిన్ కింద పడిపోయింది. తీవ్రంగా గాయపడిన ఆమెను సిబ్బంది రుయాకు తరలించారు. అక్కడ ఆమె మృతి చెందింది. విషయం తెలుసుకున్న డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్ పుల్లూరు అమర్‌నాథరెడ్డి అక్కడికి చేరుకున్నారు. జరిగిన విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

బాలిక వైద్య చికిత్సకు ఎమ్మెల్యే సాయం



చికిత్స నిమిత్తం ఆర్థిక సాయం చేస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

రేణిగుంట: శ్రీకాళహస్తి మండలం పుల్లారెడ్డి కండ్రిగ ఎస్సీ కాలనీకి చెందిన రేష్మ(12) వైద్య ఖర్చులకు శనివారం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి రూ.20వేలు ఆర్థిక సాయం చేశారు. రేష్మ పక్షవాతంతో బాధపడుతూ తిరుపతి స్విమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. అయితే ఆమెకు మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని మేఘన న్యూరాలజీ ఆస్పత్రిలో చేర్చాలని స్విమ్స్ వైద్యులు సూచించారు. అయితే తమ ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా ఉండటంతో బాలిక తల్లిదండ్రులు ఎమ్మెల్యేను సాయం కోసం ఆశ్రయించారు. దీంతో ఆయన తక్షణ సాయంగా రూ.20వేలు అందజేశారు. ఇంకా ఏమి సాయం కావాలన్నా తనకు ఫోన్ చేయాలన్నారు. దీంతో బాలిక తల్లిదండ్రులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రత్నంరెడ్డి, ప్రొఫెసర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త అంత్యక్రియలకు..



చెంగయ్య మృతదేహం వద్ద నివాళి అర్పించి ఆర్థిక సాయం అందిస్తున్న శ్రీనివాసులురెడ్డి

రేణిగుంట: మండలంలోని కరకంబాడి పంచాయతీ తారకరామానగర్‌లో టీడీపీ కార్యకర్త చెంగయ్య అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతి చెందాడు. నిరుపేద కుటుంబం కావడంతో స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి రూ.10వేలు ఆర్థిక సాయాన్ని తారకరామానగర్ ఇన్‌చార్జి మన్యం శ్రీనివాసులురెడ్డి ద్వారా శనివారం మృతుని కుటుంబ సభ్యులకు అందేలా చేశారు. ముమ్మందు ఏ సాయం కావాలన్నా నేరుగా ఎమ్మెల్యేను కలవాలని శ్రీనవాసులురెడ్డి మృతుని కుటుంబ సభ్యులకు సూచించారు. పార్టీలకు అతీతంగా సాయం అందించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పసుపులేటి రాజేష్, రమేష్ రాయల్ తదితరులు పాల్గొన్నారు.

సంఘాల మహిళలకు నీటి పరీక్షలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న లాబ్ కెమిట్ వాసు

సత్యవేడు: గ్రామ సంఘాల లీడర్లకు తాగునీటి నాణ్యతా పరీక్షలపై అగాహన కల్పించారు. శనివారం వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో నీటి పరీక్షలపై ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం ల్యాబ్ కెమిట్ వి.వాసు ఆధ్వర్యంలో క్లోరైడ్, ఫ్లోరైడ్, నైట్రేట్ ఐరన్, క్షారత్వం శాతాన్ని నీటిలో గుర్తించే విధానాలపై అవగాహన కల్పించారు. ప్రతి పంచాయతీ పరిధిలో శుభ్రమైన తాగు నీటి సరఫరా చేసేందుకు ఐదుగురితో కూడిన మహిళా సభ్యుల కమిటీలను ఏర్పాటు చేశారు. ఇందులో స్వయం సహాయక సంఘాల మహిళలు, అంగన్‌వాడీ కార్యకర్త, ఆశావర్కర్లు సభ్యులుగా ఉన్నారు. పంచాయతీలకు నీటి పరీక్షా కిట్లు గతంలో అందజేసినట్లు లాబ్ కెమిట్ తెలిపారు. కమిటీ సభ్యులు తరచూ నీటి నాణ్యతను పరీక్షించాలని, లోపాలు గుర్తిస్తే సమాచారమివ్వాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఏపీఎం స్వర్ణలత, సీసీ పళణి, గ్రామ సంఘాల మహిళలు పాల్గొన్నారు.

ద్రౌపదీ ధర్మరాజుల విగ్రహాల ఊరేగింపు



ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఊరేగింపు

ఏర్పేడు: మండలంలోని పాత వీరాపురంలో ద్రౌపదీ ధర్మరాజుల బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం స్వామి అమ్మవార్లను ఊరేగించారు. తొలుత స్వామిఅమ్మవార్ల విగ్రహాలకు అభిషేక పూజలు చేశారు. కౌరవ, పాండవ జననం హరికథాగానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మంజుల, ఆలయ చైర్మన్ మాధవరెడ్డి, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు గురవారెడ్డి, మాజీ జెడ్పీటీసీ మునిరంగారెడ్డి, మాజీ ఎంపీటీసీలు మునిరత్నంరెడ్డి, కోదండరామిరెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

శ్రీసిటీలో 'గజేంద్ర మోక్షం' కథా ప్రవచనం



కథా ప్రవచనం చేస్తున్న రవి, పాల్గొన్న భక్తులు

సత్యవేడు: శ్రీసిటీలోని అధ్యాత్మిక, సాహిత్య వేదిక శ్రీవాణి ఆధ్వర్యంలో స్థానిక శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద పండిత కవి ఒంటి రవి గజేంద్రమోక్షం కథా ప్రవచనం చేశారు.. శనివారం ఆలయ ప్రాంగణంలో భాగవతంలోని ఓ అద్భుత ఘట్టం గజేంద్రమోక్షం. ఇందులో మదించిన, అహంకరించిన ఏనుగు, చివరకు సర్వం కోల్పోయి శ్రీహరి శరణు కోరి శరణాగతిని పొంది ఎలా శ్రీహరి భక్తుడిగా మారిందో శ్రోతలకు విసపొంపుగా ఒంటి రవి వివరించారు. బాధల్లో ఉన్న వారు భగవంతుని స్మరిస్తే తప్పక ఫలితం దక్కుతుందన్నది దీని సారాంశమని ఆయన చెప్పారు. కథా ప్రవచనం ప్రారంభానికి ముందు ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు, శ్రీవిష్ణు సహస్తనామ పారాయణం చేశారు. శ్రీసిటీలో శ్రీసిటీ మేనేజింగ్‌డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, శ్రీసిటీ ప్రతినిధులు మధురెడ్డి, పి.బాలాజీ, పలు గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

వలంటీర్లు నిస్వార్థ సేవకులు



వలంటీర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

- సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

పిచ్చాటూరు: వలంటీర్లు నిస్వార్థ సేవకులని, ఇదే స్ఫూర్తితో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయ సమావేశ మందిరంలో వలంటీర్లను సన్మానించారు. మండలంలోని 165 మంది వలంటీర్లకు సంబంధించి ఐదుగురికి సేవారత్న, 160 మందికి సేవామిత్ర పురస్కారాలతో ఎమ్మెల్యే సత్కరించారు. ఆయన మాట్లాడుతూ.. దేశచరిత్రలో ఎక్కడా లేనివిధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మన రాష్ట్రంలో సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి సరికొత్త విప్లవానికి శ్రీకారం చుట్టారన్నారు. నీతి, నిజాయితీ, పారదర్శక పాలనను అందించడంలో సచివాలయ ఉద్యోగులను, వలంటీర్లను భాగస్వాములు చేసినట్లు తెలిపారు. అర్హతే ప్రామాణికంగా సచివాలయ వ్యవస్థ ద్వారా లబ్ధిదారులకు పథకాలను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ విష్ణుప్రియ, ఎంపీడీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ మధుసూదన్, ఎంఈఓ హేమమాలిని, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ భాస్కర్ నాయుడు, ఎంపీటీసీలు రమేష్ రాజు, బేబి, సర్పంచ్ అన్నాదొరై, విద్యా విభాగం రాష్ట్ర కార్యదర్శి గజేంద్ర, జేసీఎస్ కన్వీనర్ తొప్పయ్య, నాయకులు పద్మనాభం, మోహన్, చెంగల్రాయరెడ్డి, సుబ్రమణ్యం రెడ్డి, బాబు రెడ్డి పాల్గొన్నారు.



విద్యాకానుక కిట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

విద్యాకానుక పరిశీలన

స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు పంపిణీకి సిద్ధంగా ఉన్న విద్యాకానుక కిట్లను ఎమ్మెల్యే పరిశీలించారు. నాణ్యతలో రాజీ లేకుండా ఖరీదైన యూనిఫాం దుస్తులు, పుస్తకాలు, షూలు పంపిణీ చేస్తున్నారన్నారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు



నటి కీర్తి సురేష్

తొట్టంబేడు (రేణిగుంట): శ్రీకాళహస్తీశ్వర స్వామిని శనివారం ఆర్‌అండ్‌బీ రాష్ట్ర కార్యదర్శి పీఎస్ ప్రద్యుమ్న కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారికి దేవస్థానం చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈఓ కేవీ.సాగర్ బాబు స్వాగతం పలికారు. అనంతరం వారు ప్రత్యేక రాహుకేతు పూజలు చేయించుకున్నారు. అలాగే సినీ నటి కీర్తీ సురేష్ స్వామి అమ్మవారి దర్శించుకున్నారు. వారికి గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద స్వామి, అమ్మవారి చిత్రపటం, తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఏఈఓ సతీష్ మాలిక్, ఆర్‌టీఓ దామోదరం నాయుడు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.



ఆర్‌అండ్‌బీ రాష్ట్ర కార్యదర్శి పీఎస్ ప్రద్యుమ్న

అగ్ని ప్రమాద కుటుంబానికి ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న లోకేశ్వరి, ఉజ్వల్‌రెడ్డి

వరదయ్యపాళెం: మండలంలోని బత్తలవల్లం దళితవాడలో నివాసముంటున్న శేఖర్‌కు చెందిన పూరిల్లు ఇటీవల అగ్నిప్రమాదానికి గురై కాలిపోయింది. దీనిపై స్పందించిన పంచాయతీ సర్పంచ్ కె.లోకేశ్వరి, పంచాయతీ కార్యదర్శి పద్మనాభరాజు రూ. 10వేల ఆర్థికసాయాన్ని శనివారం సచివాలయం వద్ద నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ప్రచార కార్యదర్శి ఓడూరు ఉజ్వల్‌రెడ్డి చేతుల మీదుగా బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

కాసా గార్డెన్ ఈటీసీలో బోరు డ్రిల్లింగ్

రేణిగుంట: శ్రీకాళహస్తి పట్టణం కాసా గార్డెన్‌లోని ఈటీసీ ప్రాంగణంలోని పురాతన శివాలయంలో బోరు డ్రిల్లింగ్ పనులను శనివారం శ్రీకాళహస్తి దేవస్థానం చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు ప్రారంభించారు. ఇక్కడ భక్తుల వినతి మేరకు తాగునీటి బోరు వేయిస్తున్నట్లు అంజూరు చెప్పారు. శివాలయం జీర్ణోద్ధరణ పనులు పూర్తి చేయించి, త్వరలోనే ఆలయ మహా కుంభాభిషేకం నిర్వహించి, పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ సభ్యురాలు పసల సుమతి, దేవస్థానం ఏఈ వేణుగోపాల్‌రెడ్డి, పవన్ కుమార్, ఈటీసీ ప్రిన్సిపల్ నాగపద్మజ, వర్క్ ఇన్‌స్పెక్టర్ బాలాజి, కొల్లూరు హరినాయుడు, పసల కుమారస్వామి, మొగరాల గణేష్ పాల్గొన్నారు.

రామమందిరం నిర్మాణానికి విరాళం



వాసు దేవనాయుడుకు విరాళం ఇస్తున్న మయూర్

తొట్టంబేడు(రేణిగుంట): తొట్టంబేడు మండలం పొయ్య గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న రామాలయ దేవాలయంలో గ్రిల్స్ నిర్మాణానికి శ్రీకాళహస్తి ఎంజిఎం గ్రూప్ డైరెక్టర్ గుడ్లూరు మయూర్ రూ. 90 వేలను విరాళంగా మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ ఉన్నం వాసుదేవ నాయుడుకు అందజేశారు. మయూర్ మాట్లాడుతూ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని, అన్ని విధాలా గ్రామానికి సహాయ, సహకారాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామ యువత ఉన్నం సునీల్ నాయుడు, ఉన్నం ప్రసాద్ నాయుడు, ఉన్నం బాలయ్య నాయుడు పాల్గొన్నారు.

'ఏకలవ్య'లో ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో కనమనంబేడులోని ఏకలవ్య గురుకుల కళాశాలలో ఎస్టీ విద్యార్థులు ఇంటర్మీడియెట్‌లో చేరడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపల్ దామోదర్‌నాయుడు శనివారం ఓ ప్రకటనలో కోరారు. ఎంపీసీలో 30, బైపీసీలో 30, హెచ్‌ఈసీలో 30 సీట్ల చొప్పున ఉన్నాయని, తిరుపతి, చిత్తూరు జిల్లాలలో 10వ తరగతి పాసైయిన ఎస్టీ విద్యార్థులు డబ్ల్యూ.డబ్ల్యూ.డబ్ల్యూ. ఏపీటీడబ్ల్యూజీయూఆర్‌యూకేయూఎల్ఎం.ఏపీ.జీఓటీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఈ నెల 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని ఎస్టీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కుర్రకాలువ భూ బాధితులకు అండ



కలెక్టర్ వెంకటరమణారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న బాధితులు

తిరుపతి అర్బన్: రేణిగుంట మండలం కుర్రకాలువ ప్రాంతంలో ఇంటి పట్టాలున్న వారికి అండగా ఉంటామని కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. బాధితులు కొంతమంది శనివారం కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. తమ ప్లాట్లను రెగ్యులరైజ్ చేయాలని, కొందరు దళారులు తమ ప్లాట్లకు ఇబ్బందులున్నాయంటూ డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. స్పందించిన కలెక్టర్ వెంటనే శ్రీకాళహస్తి ఆర్డీవో రామారావుతో ఫోన్‌లో మాట్లాడారు. దళారులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో చిన్న, బాలసుబ్రమణ్యం, ఉదయకుమార్, శ్రీనివాసులు, గణేష, సుభద్ర, మునిశేఖర్, వాసు, బాబు పాల్గొన్నారు.

సన్నిధివీధిలో 50 అడుగుల రోడ్డు విస్తరణ



స్థల పరిశీలన చేస్తున్న ఆలయ చైర్మన్ అంజూరు

రేణిగుంట: శ్రీకాళహస్తీశ్వర స్వామి దర్శనార్థం వచ్చే భక్తులకు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా సన్నిధివీధి రోడ్డు విస్తరణకు శనివారం శ్రీకాళహస్తి దేవస్థానం చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు పరిశీలించారు. అక్రమంగా ముందుకొచ్చిన దుకాణాలకు కొలతలు వేసి మార్కింగ్ చేయించారు. చైర్మన్ మాట్లాడుతూ శ్రీకాళహస్తీశ్వరాలయానికి నిత్యం లక్షలాది మంది భక్తులు వస్తుంటారని, వీరికి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా సన్నిధివీధిలో 50అడుగుల రోడ్డును విస్తరించనున్నట్లు స్పష్టం చేశారు. మార్కింగ్ వరకు దుకాణాలను తొలగించేందుకు షాపుల యజమానులకు సోమవారం వరకు గడువు ఇచ్చినట్లు తెలిపారు. ట్రాన్స్‌కో అధికారులతో మాట్లాడి విద్యుత్ స్తంభాలను తొలగించి మరోచోటికి మార్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. దేవస్థానం సభ్యుడు సాధన మున్నా, దేవస్థానం ఇంజినీరింగ్ శాఖ ఈఈ మురళీధర్‌రెడ్డి, డీఈఈ శ్రీనివాసరెడ్డి, ఏఈ కిషోర్‌కుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రతాప్ పాల్గొన్నారు.

గుణశేఖర్‌కు ఏషియన్ ఐకాన్ అవార్డు



అవార్డును అందుకుంటున్న గుణశేఖర్

నారాయణవరం: మండలంలోని బ్రాహ్మణ తాంగేల్ గ్రామ నివాసి డాక్టర్ గుణశేఖర్ ఏషియన్ ఐకాన్ అవార్డును అందుకున్నారు. బెంగళూరులో శనివారం జరిగిన నేషనల్ యూనిటీ కాన్ఫరెన్స్–2023లో రసాయన శాస్త్రంలో పరిశోధనలకు గ్లోబల్ ఎకనామిక్ ప్రోగ్రెస్ అండ్ రీసెర్చ్ అసోసియేషన్ ఈ అవార్డును ప్రదానం చేసిందని గుణశేఖర్ తెలిపారు. అవార్డు కింద గోల్డ్ మెడల్, షీల్డ్, సర్టిఫికెట్‌తో ఆయనను సత్కరించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ, మధుమేహం వ్యాధిని తగ్గించడానికి ప్లాంట్ ఎక్స్‌ట్రాక్షన్‌తో యాంటీ డయాబెటిక్ తయారీ విధానంపై ప్రచురించిన వ్యాసానికి ఏషియన్ ఐకాన్ అవార్డు ప్రకటించారని, తన ప్రయోగాలను క్లినికల్ ట్రయల్స్ చేస్తే ఇంకా మంచి ఫలితాలు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. గతంలో ఆయన వివిధ అంశాలపై చేసిన పరిశోధన తాలూకు వ్యాసాలు అంతర్జాతీయ మెడికల్ జర్నల్స్‌లో ప్రచురితం కూడా అయ్యాయి.

టీడీపీ నేత ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలను జేసీబీతో తొలగిస్తున్న దృశ్యం

సత్యవేడు: దాసుకుప్పం పంచాయతీలో కాలువ పొరంబోకు స్థలంలోని ఆక్రమణలను రెవెన్యూ అధికారులు తొలగించారు. కాలువ పొరంబోకు స్థలంలో అక్రమంగా నిర్మించిన వ్యాపార దుకాణాలను శనివారం తహసీల్దార్ శ్రీదేవి ఆధ్వర్యంలో వీఆర్వో శేఖర్, సిబ్బంది కలసి జేసీబీతో కూల్చివేశారు. సర్వే నంబర్ 8–5ఏ, 9లో స్థానిక టీడీపీ నాయకుడు(మాజీ జెడ్పీటీసీ, జెడ్పీ వైస్ చైర్మన్ సుందర రామిరెడ్డి) ఆక్రమించడంతోపాటు, దుకాణాలకు షెడ్లు నిర్మించి తన ఆధీనంలో ఉంచుకున్నారని, ఈ స్థలంలో చికెన్ సెంటర్, టిఫిన్ దుకాణాలు, సిమెంటు షాపులకు అద్దెకు ఇచ్చి వేలాది రూపాయలు తీసుకొంటున్నారని ఫిర్యాదు అందింది. అలాగే కాలువ పొరంబోకు స్థలాల ఆక్రమణపై దాసుకుప్పానికి చెందిన శరవణకుమార్ హైకోర్టును ఆశ్రయించారు. ఆక్రమణలను తొలగించాలని కోర్టు ఆదేశించింది. ఈనేపథ్యంలో తహసీల్దార్, ఎస్ఐ పురుషోత్తంరెడ్డి పర్యవేక్షణలో దాదాపు 10 సెంట్ల స్థలం అక్రమ దుకాణాల షెడ్లను తొలగించారు.

పర్యావరణంపై అవగాహన ర్యాలీ



తిరుపతి అర్బన్: కర్బన ఉద్గారాలను తగ్గించి గాలి నాణ్యతను పెంచడంతోపాటు పర్యావరణాన్ని కాపాడుకుందామని ప్రాంతీయ పర్యావరణ విభాగం ఇంజినీర్ నరేంద్రబాబు పిలుపునిచ్చారు. జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పర్యావరణ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా పర్యావరణ పరిరక్షణపై శనివారం ర్యాలీ నిర్వహించారు. తిరుపతిలోని ప్రధాన కూడళ్ల వద్ద పర్యావరణ ఇంజినీర్లు, ప్రాంతీయ రవాణాశాఖ అధికారులు ప్లకార్డులతో నినాదాలు చేశారు. ట్రాఫిక్ సిగ్నల్ ఉన్నప్పుడు వాహనాల ఇంజిన్‌ను ఆఫ్ చేయాలని సూచించారు. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ యువకిషోర్, సహాయ పర్యావరణ ఇంజినీర్లు మదన్‌మోహన్‌రెడ్డి, పీవీ కిషోర్ రెడ్డి, శశికళ, ఆర్.కుమార్ తదితరులు పాల్గొన్నారు.